క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల



స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

కురిచేడు: మండలంలోని దేకనకొండ, పెద్దవరం, బయ్యవరం గ్రామాల కూడలిలో సింగరయ్య కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కొండ వద్ద స్వామి వారికి పొంగళ్లు తయారు చేసి నివేదించారు. నూతనంగా విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భక్తులు హోమాలు చేశారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ట వేదమంత్రోచ్చరణల మధ్య జరిగింది. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

ఆస్పత్రిలో ఉన్న వృద్ధుడికి పింఛన్ అందజేత



పింఛన్ అందుకుంటున్న తిరుపతయ్య

దొనకొండ: మండలంలోని వెస్ట్ కంభంపాడు గ్రామానికి చెందిన పోకూరి తిరుపతయ్య అనారోగ్యంతో ఒంగోలు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు వలంటీర్ గోపి బుధవారం కిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు. తమకు పింఛన్ అందజేసిన ప్రభుత్వానికి, సిబ్బందికి తిరుపతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

దాతల సహకారంతో గుడికి సిమెంట్ రోడ్డు



పనులు ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

దొనకొండ: స్థానిక నాలుగు రోడ్ల కూడలి ప్రాంతం రోడ్డులో ఉన్న ఆనంద ఆశ్రమం ప్రాంగణంలోని దేవాలయాలకు కురిచేడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆవుల వెంకటరెడ్డి సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వెంకటరెడ్డి మరియు కొందరు దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధికి పూర్తి స్థాయిలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆశ్రమ ధర్మకర్త భైరవానంద స్వామి తెలిపారు.

కోర్టు ఆదేశాలతో కేసు నమోదు

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ నేత కందుల నారాయణరెడ్డి దూషించడంతో తాను ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ పొదిలిలో ప్రెస్ మీట్ పెట్టానని, దీంతో తనపై కొంత మంది కక్ష కట్టి ఫోన్‌లో బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాల ప్రకారం నిందితులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శశికుమార్ తెలిపారు. రవికుమార్, శేఖర్‌రెడ్డి, చంద్ర, రోహిత్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తన ఇంటి వద్దకు వచ్చి డ్రైవర్‌ను బెదిరించడంతో పాటు ఫోన్‌లో కూడా గుర్తుతెలియని నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఫిర్యాదులో సూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొమరోలు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరసయ్య తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైనందున ఎన్నికల కమిషన్ షరతులకు లోబడి ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులకు డ్రిప్‌ల పంపిణీ

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో రైతులకు మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పైపులను బుధవారం పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ఆ పరికరాలతో నీరు ఆదా అవుతుందని, ఎకరా సాగుకు ఉపయోగించే నీటితో డ్రిప్ ద్వారా 8 ఎకరాలు సాగు చేయవచ్చని చెప్పారు. మండలంలో 324 మంది రైతులు 817.54 ఎకరాలకు స్ప్రింక్లర్స్, డ్రిప్ పైపులకు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రభుత్వం ఏపీఎంఐపీ ప్రాజెక్టు ద్వారా 32 మంది రైతులకు రూ.25 లక్షల విలువ చేసే పరికరాలు అందాయని వివరించారు. ఉప సర్పంచి షేక్ మస్తాన్, వీఏఏ డి.శ్రీను పాల్గొన్నారు.

మాంసం విక్రయాల్లో అవకతవకలు

- జబ్బున పడిన మూగజీవాలే వధ
- తూకం తక్కువ.. ధర ఎక్కువ
- మాంసం ప్రియులకు టోకరా



రోడ్డు పక్కనే మాంసం ముక్కలు కొడుతున్న వ్యాపారి

గిద్దలూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మాంసం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ధరలు అధికంగా పెంచి తూకాలు తక్కువగా వేస్తూ విక్రయిస్తున్నారు. కిలో మాంసం రూ.700 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. కిలో మాంసానికి 200 గ్రాముల నుంచి 250 గ్రాముల మేర తూకం తక్కువగా వేస్తూ ప్రజలను బహిరంగంగా మోసగిస్తున్నారు. ఇక తలకాయ మాంసం తినాలంటే సుమారు రెండు గంటల సమయం వెచ్చించి రూ.1000 నుంచి రూ.1100 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ మంది మాంసం వ్యాపారులు గొర్రెలను కోస్తు పొట్టేళ్లుగా చెబుతూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం పశువైద్యాధికారి ధ్రువీకరించిన అనంతరమే వధశాలల్లో పొట్టేళ్లు, మేకలు, గొర్రెలను కోయాల్సి ఉంటుంది. ఆ సమయంలో మున్సిపల్ అధికారులు పరిశీలించి స్టాంప్ వేయాల్సి ఉంది. వాస్తవంగా అటువంటి నిబంధనలు ఎక్కడా అమలు జరగడం లేదు. వ్యాపారులు అధికారులను బుట్టలో వేసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దేవాలయాలకు దూరంగా, ప్రతి శనివారంతో పాటు వివిధ ప్రభుత్వ సెలవు దినాల్లోనూ మాంసం విక్రయాలు జరపరాదని నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించడం లేదు.

ఒక్క ఆదివారం 40 వేల కిలోల చికెన్ విక్రయం

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలల్లో ఆదివారం, గురువారాల్లో సుమారు 200కు పైగా పొటేళ్లు, మేకలు, గొర్రెలను వధిస్తూ వాటి మాంసం విక్రయిస్తున్నారు. చికెన్ షాపులు మాత్రం 160కి పైగా ఉన్నాయి. అందులో రోజూ 7 నుంచి 8 వేల కేజీల చికెన్ విక్రయిస్తున్నారు. ఒక్క ఆదివారం మాత్రం 40 వేల కిలోల చికెన్ అమ్ముడుబోతోంది.



తూకం వేస్తున్న మాంసం విక్రయదారుడు

రోడ్డుకు పక్కన ఎక్కడ పడితే అక్కడే వధిస్తూ వాటిలోని వ్యర్థ పదార్థాలను సైడు కాలువల్లో వేస్తున్నారు. మాంసం విక్రయాలతో పాటు చేపల విక్రయాలు రోడ్డు పక్కగా జరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. జబ్బున పడ్డ మేకలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా వధిస్తూ మార్కెట్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జబ్బున పడిన మూగజీవాల మాంసాన్ని తినటంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మాంసం విక్రయాలను నిబంధనల మేరకు నిర్వహించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ వాడినా..అమ్మినా జైలుకే

మార్కాపురం: డ్రగ్స్ వాడినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ భీమానాయక్ హెచ్చరించారు. ఎంపీజే ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలపై కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్ అధ్యక్షత వహించారు. సీఐ భీమానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా గత నెల 20 నుంచి మార్చి 2 వరకు నిర్వహిస్తున్న ప్రచారోద్యమంలో భాగంగా కిట్స్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, ట్విట్టర్ తదితర ప్లాట్‌ఫారాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కలలను నేరవేర్చాలని, సరైన ఆలోచనలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సెబ్ సీఐ రాగమై మాట్లాడుతూ డ్రగ్స్ వాడటంతో అనారోగ్యంతో పాటు లైఫ్ టైమ్ తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడి, రజాక్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీ

రాచర్ల: మండల కేంద్రం రాచర్లలో వృద్ధులు, వికలాంగుల పింఛన్‌లను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అవ్వా, తాతలు, వికాలాంగులు, వితంతువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు. రూ.2,750 పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకవీడు ఎంపీటీసీ రవి, వైఎస్సార్ సీపీ నాయకులు యేలం మురళి, సూర పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత రవి

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేపీ



రవికుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్ : మార్కాపురం తెలుగు యువత మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అనుచరుడు ఇండ్ల రవికుమార్‌రెడ్డి బుధవారం తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీ చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ రెడ్డికి, ఆయన అనుచరులకు కండువా కప్పి ఎమ్మెల్యే కేపీ వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విధానాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరినట్లు రవికుమార్‌రెడ్డి చెప్పారు. తాను స్థాపించిన ఇండ్ల ఫౌండేషన్ ద్వారా పలు సేవ కార్యక్రమాలు చేపట్టానని, భవిష్యత్తులో సేవలు కొనసాగిస్తూనే పార్టీ ఆశయాలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిల ద్వారా ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీని రవికుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, కౌన్సిలర్స్ కె.నగేష్, కొత్త కృష్ణ, పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, బట్ట గిరి తిరుపతిరెడ్డి, జవ్వాజీ రంగారెడ్డి, కురాటి చెన్నకేశవులు, దొంత నాగరాజుగౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు



ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితో మండల ఇన్‌చార్జిలు

పొదిలి: ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సచివాలయాల మండల ఇన్‌చార్జిలకు బుధవారం తిరుపతిలో అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం, పోలింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి తొలి ప్రాదాన్యం ఓటు చేసేలా ఓటర్లను అభ్యర్థించాలని చెప్పారు. పేరు పక్కన ఒకటి అంకె వేయాలని సూచించాలని సదస్సులో పేర్కొన్నారు. కొనకనమిట్ల మండల ఇన్‌చార్జి సూరవరపు పెద్ద వెంకటరెడ్డి, పొదిలి పట్టణ ఇన్‌చార్జి జి.చెన్నారెడ్డి, రూరల్ ఇన్‌చార్జి పేరం సుభాష్‌రెడ్డి, తర్లుపాడు ఇన్‌చార్జి రామాంజనేయులరెడ్డి, మార్కాపురం టౌన్ ఇన్‌చార్జి రవి, రూరల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేర్నాటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

కొనకనమిట్ల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, నాయకులు ఉడుముల గురవారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చినారికట్లలో ఓటర్లను కలిసి మద్దతు పలకాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పథకాలు వివరిస్తూ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సర్పంచ్ అనూరాధ, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి, బంగారురెడ్డి, బాలకృష్ణరెడ్డి, కంది బాలవెంకటరెడ్డి పాల్గొన్నారు.

రక్త దాతలే ప్రాణదాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: రక్త దాతలే ప్రాణదాతలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండల కేంద్రం రాచర్ల పార్కులో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. రక్తం లేక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కపాడేవారే రక్తదాతలన్నారు. రాచర్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి గర్భిణులు, ఆక్సిడెంట్‌కు గురైన పేషెంట్లు, రక్తహీనతతో బాధపడే వారికి, తలసేమియా చిన్నారులకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. 18 నుంచి 60 ఏళ్ల వారు 45 కేజీల బరువు, రక్తంలో 12.5 మిల్లీ గ్రాముల హిమోగ్లోబిన్ ఉన్న ఎవరైనా తమ జీవితకాలంలో మూడు నెలలకు ఒక్కసారి నిరంభ్యంతరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. సర్పంచులు రమేష్, పల్నాటి లతీఫ్, తలపాటి దేవదానం, నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం చైర్మన్ కన్నసాని ఓబులేసు, వైఎస్సార్ సీపీ నాయకులు యేలం మరళి, సూర పాండురంగారెడ్డి, పగడాల శ్రీరంగం, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, సివిల్ సర్జన్ డాక్టర్ సుధాకర్, రక్త నిల్వ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, జేవీ నారాయణ పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సుధాకర్

పొదిలి: స్థానిక జువ్వలేరు రోడ్డులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐ సుధాకర్ మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదువుకోవటం ద్వారానే వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. చట్టం నిత్యం తోడుగా ఉంటుందని చెప్పారు. ఎస్‌ఐ మల్లికార్జున మాట్లాడుతూ బాలికలు అప్రమత్తంగా ఉండాలని, అదే సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు, లేదా ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రిన్సిపాల్ అనూరాధ, బాలికలు పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు ఆర్థిక సాయం



మహిళలకు నగదు అందిస్తున్న ఏపీఓ రమేష్

మార్కాపురం: మండలంలోని రాయవరం, రామచంద్రపురం, వేములకోట, జగనన్న లేఔట్లలో ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రూ.1.50 లక్షల నగదును అందజేసినట్లు ఏపీఓ రమేష్ తెలిపారు. రాయవరంలో ముగ్గురికి, వేములకోట, రామచంద్రపురంలో ముగ్గురికి కలిసి ఈ నగదు అందించామని వైఎస్సార్ క్రాంతి పథం సభ్యులు జగనన్న లేఔట్‌ల్లో ఇళ్లు కట్టుకుంటుంటే వారికి డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రుణం అందిస్తామన్నారు. ఉగాదిలోపు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ చందు, సీసీ మనోకుమారి, భార్గవి, లలిత పాల్గొన్నారు.

సమష్టి కృషితో ప్రజలకు చేరువగా పథకాలు



పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

పెద్దదోర్నాల: సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమష్టిగా కృషి చేసి ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరువ చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా రమణారెడ్డి సూచించారు. బుధవారం పెద్దదోర్నాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన వారికి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



గుంపులు గుంపులుగా వెళ్తున్న కుక్కలు

కంభం: మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ మనుషులు, గేదెలు, ఆవులపై దాడులు చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవతున్నారు. రోడ్లపై తిరుగుతున్న వారిని వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయి. కొన్ని వీధుల్లో పెంపుడు కుక్కలు సైతం పాదచారులు, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇక రాత్రి 9 గంటల తర్వాత నడుచుకుంటూ వెళ్లాలన్నా, ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా కుక్కల ధాటికి ప్రజలు భయపడుతున్నారు. రోజుకు ఒకరిద్దరు కుక్క కాటుకు గురై వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. బుధవారం పట్టణంలోని లాడ్‌ఖాన్ వీధిలో ఒక దూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి.

గతంలో కూడా పలుమార్లు గేదెలపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయని రైతులు చెబుతున్నారు. రాత్రి పూట ఇతర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లలో వచ్చిన వారికి ఆటోలు దొరక్కపోతే వారు ఇంటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కందులాపురం కూడలి, రావిపాడు రోడ్డు, మెయిన్ బజారు, ఏబీఎం చర్చి, వై.జంక్షన్ సమీపంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలబారి నుంచి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.1.50 లక్షలతో కళావేదిక నిర్మాణం

దర్శి: మండలంలోని శేషంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.1.50 లక్షలతో కళావేదిక నిర్మించారు. ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాదాసు కృష్ణ తన తండ్రి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం సొంత నిధులతో కళావేదిక నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృష్ణని అభినందించారు.

గడ్డివామి దగ్ధం

కంభం: ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం కంభంలో జరిగింది. వివరాలు.. స్థానిక కోనేటి వీధిలో సయ్యద్ ఇస్మాయిల్‌కు చెందిన గడ్డివామికి నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ వాహనం మంటలు అదుపు చేసింది. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోవడంతో రూ.20 వేల నష్టం జరిగిందని రైతు వాపోయాడు.